క్లుప్తంగా

పైపు లైన్‌కు మరమ్మతులు



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే వాటర్ పైపులైన్ ఎయిర్ వాల్వ్ లీకై సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పెద్ద ఎత్తున తాగునీరు వృథా అయింది. వెంటనే స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు దానికి అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద 600 దయా వాటర్ పంపింగ్ లైన్ ఎయిన్ వాల్వ్ పై ఏర్పడిని లీకును ఆదివారం తాత్కాలికంగా మరమ్మతులు చేసి, సోమవారం ఉదయం నాటికి పూర్తి చేయాలని నగర కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శాశ్వత ప్రతిపాదికన లీకులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఏఈలను ఆదేశించారు.

ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్

గుంటూరు ఈస్ట్: వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు విద్యానగర్, సాయిబాబా రోడ్డు వద్ద స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. స్నేక్ డ్రైవింగ్, హై స్పీడ్ డ్రైవ్ చేస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మద్యం షాపులకు నోటీసులు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని మద్యం షాపుల నిర్వాహకులకు ఆదివారం తాడేపల్లి ఎస్ఐ రమేష్ నోటీసు అందజేశారు. డీఎస్పీ సీహెచ్ రవికాంత్ ఆదేశాల మేరకు తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు సూచనల మేరకు తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని మద్యం షాపులకు నోటీసులు అందజేశామని ఎస్ఐ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, మద్యం దుకాణాల్లో అమ్మకాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, అలాగే సమయపాలన తప్పనిసరిగా పాటించాలని వైన్ షాపుల్లో పరిమితికి మించి మద్యం అమ్మకాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా అధిక మొత్తంలో ఒకే వ్యక్తికి మద్యం అమ్మినట్లు తెలిస్తే మద్యం కొనుగోలు చేసిన వ్యక్తితో పాటు వైన్‌షాపు యజమాని, అమ్మిన సిబ్బందిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చారిత్రక అంశాలపై అవగాహన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా చారిత్రిక కథలు, నీతి కథలు వంటి పలు అంశాలపై ఉపాధ్యాయుడు అనిల్ అవగాహన కల్పించారు. చారిత్రిక అంశాలు తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, స్థితిగతులు వంటివి తెలుసుకోవచ్చని చెప్పారు. నీతి కథలు వినడం , చదవడం ద్వారా విద్యార్థులు ఉన్నత భావాలు కలిగి ఆదర్శవంతంగా సమాజంలో జీవిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి పి.జేమ్స్, డి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రేపు సామూహిక చండీయాగం



మంగళగిరి: పట్టణంలో పాత మంగళగిరి జాతీయ రహదారిపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ ఆలయంలో ఈ నెల 28న మంగళవారం సామూహిక చండీయాగం నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. చండీ యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

రేపు సామూహిక చండీ హోమం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని దుర్గానగర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో 28న సామూహిక చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైశాఖ పంచమి మంగళవారం ఉదయం 7 గంటలకు సామూహిక చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని, భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

నెహ్రూనగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని శ్రీకృష్ణ యాదవ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన యాదవ విద్యార్థులకు సేవా సమితి ఆధ్వర్యంలో నల్లచెరువులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రతిభ పురస్కారాలు, స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ చావలి సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు రెండు లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. వాటిలో ఒకటి విద్య, రెండవది సమాజానికి సేవ చేసే గుణం ఉండాలన్నారు. డబ్బే ముఖ్యం కాకుండా కొంత వృత్తిపరమైన సంతృప్తి కూడా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సేవా సమితి ద్వారా ఏడు లక్షల రూపాయిలు ప్రతిభా పురస్కారం కింద అందజేయడం జరిగిందన్నారు. విద్యపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో బాదినేడి హరిబాబు, సాయికృష్ణ, శ్రీహరి యాదవ్, యరగొర్ల ఠాగూర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న దృశ్యం

అలరించిన సినీ సౌరభాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం మహతీ స్వరసుధ 24వ వార్షిక పంచమ సినీ సౌరభాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ గాయకులు పత్రినిర్మల సీహెచ్ రాజ్యలక్ష్మి, ఎండీ జరీనా, వై.హేమమాలిని, ఎన్.లక్ష్మి, కె.ప్రద్యుమ్నసత్యోద్భవి, జి.వీరయ్య, డీటీ సాయిబాబా తదితరులు తమ గాత్రధారణలో అలనాటి మేటి చిత్రాల్లోని మధుర గీతాలను శ్రావంగా ఆలపించారు. కీబోర్డుపై పి.ప్రసాద్, తబలాపై ఎం.బాబు, ప్యాడ్స్‌పై బి.ప్రసాద్ వాయిద్య సహకారం అందించారు. వ్యాఖ్యాతగా కుమార్ వ్యవహరించారు. కె.మదన్‌మోహన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల సంయుక్త ఆధ్వర్యంలో మండవ వెంకట్రామయ్య, రమాదేవిల 70 వసంతాల కళ్యాణ దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు మాధవస్వామి బృందం, శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి ఆశీర్వచనం అందించారు. అనంతరం నంది మొమెంటో, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జీవీ.రాయుడు, సూర్యదేవర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గీతాలాపన చేస్తున్న గాయనీగాయకులు

స్కిజోఫ్రెనియాకు ఆధునిక చికిత్స

మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కె.సురేష్‌కుమార్

లక్ష్మీపురం: స్కిజోఫ్రెనియా అనేది ఒక మానసిక వ్యాధి అని దీనిని అశ్రద్ధ చేస్తే ఆ మనిషికి ఎంతో ప్రమాదకరమని తక్షణమే సైక్రియాట్రిస్టులను సంప్రదించాలని కాటూరి మెడికల్ కళాశాల మానసిక వైద్య నిపుణులు కె.సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంస్థకార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకీ మానసిక సమస్యలు పెరిగిపోతూనే ఉన్నాయని వయస్సుతో సంబంధం లేకుండా స్కిజోఫ్రెనియా అనే మానసిక రుగ్మత పాలిట ఎక్కువ మంది పడుతున్నారని వివరించారు. తనలో తాను మాట్లాడుకోవడం ఒంటరిగా ఉండి పోవడం, విపరీతమైన కోపం తనలో తాను నవ్వుకోవడం లాంటివి స్కిజోఫ్రెనియా లక్షణాలన్నారు. జెనెటిక్ పరిస్థితుల ప్రభావం మెదడులోపాలు, మానసిక ఒత్తిడికి గురి చేసే ఆర్థిక నష్టాలు, వ్యసనాలు, అప్పులు విషాద ఘటనలు వంటివి ఈ వ్యాధికి కారణాలన్నారు. మందుల ద్వారా స్కిజోఫ్రెనియా వ్యాధికి ఆధునిక వైద్యం అందుబాటులో వచ్చిందన్నారు. ఇటువంటి తీవ్రమైన మానసిక వ్యాధి ఉన్న రోగులకు థెరపీ చికిత్స విధానం ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ సురేష్‌కుమార్ సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.సురేష్‌కుమార్, పక్కన సంస్థ సభ్యులు

నైపుణ్యంతో సేవలందించాలి

ఆప్కాబ్ ఎండీ ఆర్ఎస్ రెడ్డి



మంగళగిరి: వృత్తి పరమైన నైపుణ్యాన్ని పెంచుకుని రాష్ట్ర కో–ఆపరేటివ్ బ్యాంక్(ఆప్కాబ్) అభివృద్ధికి కృషి చేయాలని ఆప్కాబ్ ఎండీ ఆర్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నీరుకొండ గ్రామంలో రెండు రోజుల పాటు జరిగిన ఆప్కాబ్ ఉద్యోగుల శిక్షణ తరగతులు ఆదివారం ముగిసాయి. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి హాజరైన ఉద్యోగులకు ఎండీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం వీసీ మనోజ్ కుమార్ అరోరా, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కల్లూరి వినాయక్, పారీ స్కూలు డీన్ డాక్టర్ భరద్వాజ, శైలజ కొసరాజు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసు పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ కీలకం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్ సర్వీసు పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ (సమకాలీన అంశాలు) కీలకపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల్లో భాగంగా ఆదివారం అంతర్జాతీయ అంశాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ అంశాలుగా కరెంట్ అఫైర్స్ చదవాలని, వీటి కోసం ప్రతి రోజూ వార్తా పత్రికలు, దినపత్రికలను అధ్యయనం చేయాలని సూచించారు. దినపత్రికల్లోని ఎడిటోరియల్ పేజీల్లో ఉండే వ్యాసాలు, ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సమకాలీన అంశాలతో పాటు ప్రస్తుత పరిణామాలను గురించి అవగాహన పొందవచ్చునని అన్నారు. ఈసందర్భంగా ప్రపంచపటాన్ని చూపిస్తూ వివిధ దేశాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలను వివరించారు. ఆర్థిక రంగం , సైన్స్ అండ టెక్నాలజీ, క్రీడలు, అవార్డులు, భౌగోళిక అంశాల్లో జరుగుతున్న మార్పులు, కోర్టుల తీర్పులు, రాజకీయ రంగంలో చోటో చేసుకుంటున్న సమకాలీన అంశాలను చదువుతూ నోట్సు రూపొందించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో 'సన్' కోఆర్డినేటర్స్ ఆశిష్, హరీష్, సంధ్య, బ్లెస్సి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

అలరించిన కళాంజలి గానామృతం

నగరంపాలెం: స్థానిక రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళాంజలి వ్యవస్థాపక అధ్యక్షులు తొట్టెంపూడి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం 29వ కళాంజలి హిందీ, తెలుగు సినీ గీతాల గానామృత కుంభమేళా నిర్వహించారు. గాయనీ, గాయకులు తొట్టెంపూడి రమేష్, రామదాసు, షాన్ వాజ్, రసూల్‌బాబు, టి.సుధీర్, సాంబశివరావు, శివలీల సుధారాణి, డాక్టర్ భాగ్యశ్రీ, నౌలన్, హిందీ/ తెలుగు చిత్రాల సినీ గీతాలను ఆలపించారు. ఘంటసాల మునిమనవరాలు శ్రీరాజరాజేశ్వరి, డాక్టర్ నిమ్మల శేషయ్య, తిరుపతయ్య, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం కెనడి స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, సమాజ సేవా తత్పరురాలు కోగంటి సావిత్రమ్మకు మదర్‌థెరిసా అవార్డు ప్రదానం చేశారు. వ్యాఖ్యాతగా ఇస్మాయిల్ వ్యవహరించారు.



సావిత్రమ్మకు మదర్‌థెరిసా అవార్డుతో సత్కారం

కిలో చికెన్.. రూ.300

- స్కిన్ లెస్‌కు మరో రూ.20 అదనం
- ధరలు ఇంకా పెరిగే అవకాశం
- వాతావరణ మార్పులు కారణమంటున్న వ్యాపారులు
- ఎగబాకుతున్న గుడ్డు ధర



చికెన్ షాప్

తాడేపల్లి రూరల్: మాంసాహార ప్రియులకు చేదువార్త ఇది. కిలో చికెన్ 'ట్రిపుల్' సెంచరీ దాటింది. గుడ్డు ధర అంతకంతకూ ఎగబాకుతోంది. మొన్నటి వరకూ ఉన్న ఎండల మంట ఇప్పుడు చికెన్ ధరలపై పడింది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణం కొంత చల్లబడినా ధరలు పెరుగుతూ పోతున్నాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.300 పలుకుతోంది. పెరిగిన ధరలతో మాంసాహార ప్రియులు అయ్య బాబోయ్ అంటున్నారు. మండుటెండలకు బ్రాయిలర్ కోళ్లు చనిపోవడం, తగినంత దాణా తీసుకోకపోవడం వంటి కారణాలతో కోళ్ల బరువు పెరగలేదు. ఇది చికెన్ ధర పెరగడానికి కారణాలుగా ఫౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు. ఇక స్కిల్‌లెస్ చికెన్ అయితే కిలో రూ. 320 వరకు విక్రయిస్తున్నారు. ఇక లైవ్‌బర్డ్ కిలో రూ.180 పలుకుతోంది. రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 7కి చేరింది.

కోళ్లకు వడదెబ్బ..

వేసవిలో కోళ్లు ఎండను తట్టుకోలేక వడదెబ్బకు చనిపోతుంటాయి. ఎక్కువగా నీళ్లు తాగడం, ఎండ తీవ్రతతో దాణా తీసుకోవడం తగ్గించేస్తాయి. దీంతో కోళ్ల బరువుతో పాటు ఎదుగుదల కూడా ఉండదు. అలాగే గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వారం రోజుల కిందటి వరకూ మండిన ఎండకు ఐదు నుంచి పది శాతం వరకు బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడ్డాయి. రెండు మూడు రోజులుగా ఎండల తీవ్రత తగ్గినప్పటికీ ఇప్పటి వరకూ ఉన్న ఉష్ణోగ్రతలు బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో చికెన్ ధర ఆకాశాన్నంటింది. ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో బ్యాచ్‌లను ఫౌల్ట్రీ యజమానులు రెడీ చేయాల్సి ఉంటుంది. పూర్తి స్థాయిలో బ్రాయిలర్ కోడి అందుబాటులోకి రావాలంటే 45 రోజుల సమయం పడుతుంది. అప్పటి వరకూ ఇదే ధర కొనసాగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే లేయర్ కోళ్ల విషయంలో కూడా ఇదే విధానం కొనసాగనుంది. అధిక ఉష్ణోగ్రతలకు కోడి గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గింది. 20 శాతం ఉత్పత్తి పడిపోయింది. దీంతో గుడ్డు రేటు కూడా సహజంగానే పెరిగింది. మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా కోళ్లు అందుబాటులో లేకపోవడం, గుడ్ల ఉత్పత్తి పడిపోవడంతో ధరలు పెరిగాయని ఫౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు.

చల్లబడే వరకు ఇంతే...

వాతావరణం మరింత చల్లబడే వరకు చికెన్ ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్‌ను బట్టి మరో రూ. 50 వరకు అదనంగా పెరగవచ్చని పేర్కొంటున్నారు. మరో వైపు ధరలు అధికంగా ఉండడంతో మార్కెట్‌లో చికెన్ అమ్మకాలు కూడా తగ్గిపోయినట్లు వ్యాపారులు వాపోతున్నారు. వేసవి తీవ్రత, ధర పెరుగుదల కారణంగా 15–20 శాతం అమ్మకాలు తగ్గినట్లు అంచనా.



గుడ్ల ట్రేలు

ఉత్పత్తి గణనీయంగా తగ్గింది



వేసవి నేపథ్యంలో ఫౌల్ట్రీల నుంచి పూర్తి స్థాయిలో కోళ్ల సరఫరా జరగం లేదు. వేసవిలో అధిక ఉష్ణోగ్రత వల్ల కోళ్లు ఎక్కువగా మృతి చెందడం, రైతులు కోళ్ల పెంకాన్ని తగ్గించడం వల్ల ఒక్కసారిగా చికెన్ కొరత ఏర్పడింది. దీంతో ధరలు రోజురోజుకూ పెరుగుతూ వస్తున్నాయి.. ఎన్ని రోజులు నిలకడగా ఉంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు కోళ్ల వ్యాపారంలో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటునన మా లాంటి వ్యాపారులకు ప్రస్తుతం పెరిగిన ధర కొంతమేర ఊరటనిస్తుంది.

– ఖదీర్, బిస్మిల్లా చికెన్ షాపు యజమాని, నులకపేట.

ఖరీఫ్‌కు సాగుకు అన్నదాతలు సన్నద్ధం

- విత్తన కొనుగోళ్లకు కనిపించని ముందస్తు చర్యలు
- నకిలీలతో అన్నదాతలు సతమతం
- దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న రైతులు



తాడికొండలో ఖరీఫ్ పంట సాగు చేసేందుకు భూమిని దున్ని సిద్ధం చేస్తున్న రైతు

తాడికొండ: రుతు పవనాల జాడ తెలియడంతో ఇప్పటికే రాష్ట్రంలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీంతో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తమ పంట పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం విత్తన ఎంపికే కీలకం కావడంతో దీనిపై స్పష్టమైన సమాచారం అందించే పరిస్థితి లేక రైతులు సతమతం అవుతున్నారు. వ్యవసాయ శాఖాధికారులు ఎన్నికల సాకుతో గ్రామాల్లో కనిపించిన దాఖలాలు లేవు. గతేడాది వాతావరణ పరిస్థితులు, అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది ఏఏ పంటలు సాగుచేస్తే బాగుంటుంది... ఆయా పంటలకు గిట్టుబాటు ధరలు ఎలా ఉంటాయి అనే సమాచారం గ్రామంలో అధికారులు సభల ద్వారా చేరవేయాల్సి ఉంటుంది. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగుపై అన్నదాతలకు సమాచారం ఉండేలా చూడాల్సిన వ్యవసాయాధికారులు ఎన్నికల సాకుగా కనిపించడం లేదని కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కురిసిన అకాల వర్షాలు, తుపాను కారణంగా సాగు చేసిన జొన్న, మినుము, పెసర, శనగ వంటి పంటలు వేసిన రైతులు బాగా నష్టాల పాలయ్యారు. అయితే మిర్చికి సాగునీరు సకాలంలో అందకపోవడం, వర్షాలు చివరి రోజుల్లో మెనుకంజ వేయడం కారణంగా పంట దిగుబడిపై ప్రభావం చూపించింది. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం జమ చేయడంతో.. అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పత్తి ఎకరాకు 15–20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిన నేపథ్యంలో.. ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇక జొన్న పంట పూర్తిగా నేలకొరిగి రైతులకు ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడి కూడా రాని కారణంగా అన్నదాతలకు తీవ్ర నష్టం ఏర్పడింది. ఈ క్రాప్ బుకింగ్ చేసినా సంబంధిత విత్తన కంపెనీ నుంచి రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలే లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో విత్తన డీలర్ల వద్ద నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు నకిలీల ఆటకట్టించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. పలువురు వ్యాపారులు సీడ్ ప్రాసెసింగ్ చేయకుండానే నేరుగా విత్తనాల రూపంలో రైతులకు అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో విత్తన డీలర్ల వివరాలను రైతులకు తెలియజేసేలా సదస్సులు నిర్వహించడంతో పాటు నకిలీలు మార్కెట్లోకి విడుదల కాకుండా తగిన నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. విత్తనాల ధరలను దుకాణాల వద్ద పట్టికల రూపంలో రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి రైతుకు విత్తనాల కొనుగోలు అనంతరం వ్యాపారి, రైతు సంతకంతో కూడిన బిల్లును ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. దీనిపై వివరణ అడిగేందుకు మండల వ్యవసాయాధికారి పి.నరసింహారావుని ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడికొండ: తాడికొండలోని శ్రీ సత్యసాయి స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి, ఎన్ఆర్ఐ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో మొత్తం 92 మందికి పరీక్షలు చేసి, వీరిలో 31 మందిని శుక్లాల ఆపరేషన్ నిమిత్తం గుర్తించారు. వీరికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ఎన్ఆర్ఐ అసుపత్రికి తీసుకెళ్లి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా నిర్వాహకులు బండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ధనేకుల హరిబాబు, కాశింశెట్టి పున్నారావు, పాఠశాల ఇన్‌చార్జి రాయపూడి అనీల్, నీరుకొండ పెద్దబ్బాయి ఎన్ఆర్ఐ వైద్యులు ఎం.కీర్తన పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని జీఆర్పీ పోలీసులు ఆదివారం రాత్రి గుర్తించారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుంది. నిండు నీలం రంగు నిక్కరు మాత్రమే ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరాంజనేయుని ఆలయంలో కోలాటం

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం సువర్చలా సహిత అంజనేయస్వామి వారి ఆలయ ఉత్సవాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కోలాట నృత్య భజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ భజన కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు కోలాట భజన నిర్వహించారు.

తెనాలి కవులకు స్వర్ణకంకణ సత్కారం

తెనాలి: ఏలూరుకు చెందిన శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన 134వ అంతర్జాతీయ సీస పద్య కవి సమ్మేళనంలో తెనాలికి చెందిన ముగ్గురు కవులు/రచయితలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో స్వర్ణకంకణ సత్కారం చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన సీసీ పద్య వైభవం సంకలనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల పద్య కవుల నుంచి మూడేసి సీస పద్యాలను ఆహ్వానించారు. ఆయా పద్యాలతో తీసుకొచ్చిన సంకలనం ఆవిష్కరణను ఆదివారం ఏలూరులోని వైఎంహెచ్ఏ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. సంకలనానికి డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి కవి ధర్మం అనే శీర్షికన తన పద్యాలను పంపారు. ఇదే వేదికపై తెనాలికి చెందిన పౌరాణిక నటుడు, పద్యకవి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవి, రంగస్థల నటుడు, పద్యకవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. సీస పద్య వైభవానికి పద్యాలను పంపిన వీరిని కూడా నిర్వాహకులు సత్కరించి స్వర్ణకంకణ సత్కారం చేశారు.



తెనాలి రచయితలకు అన్నమయ్య పురస్కారాలు

తెనాలి: సంప్రదాయ కళల పరిరక్షణ సమితి, చిత్తూరు ఎఎస్ ఫౌండేషన్, తిరుపతి సంస్థల నిర్వహణలో ఆదివారం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ పరిధిలోని బైరెడ్డిపల్లిలో జరిగిన సాహితీ వేడుకల్లో తెనాలి రచయితలు అన్నమయ్య పురస్కారాలను స్వీకరించారు. తెనాలికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు నాలుగు దశాబ్దాలుగా సాహితీ రచనలు చేస్తూ తెలుగుభాషా వికాసానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా అన్నమయ్య పురస్కారం అందజేసినట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మడవలి చిరంజీవి, సంస్థ ప్రధాన కార్యదర్శి మడవలి తులసి, ఎ.ఎస్ ఫౌండేషన్ అధ్యక్షులు అభీలాల శ్రీధర్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన వివిధ రంగాల ప్రముఖ కళాకారులు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు. వెంకట రఘునాధరావుకు స్థానిక శారదా ఎలిమెంటరీ పాఠశాలలో పనిచేస్తున్న మునిపల్లె వెంకట రఘునాధరావు కూడా ఇదే వేదికపై అన్నమయ్య పురస్కారాన్ని స్వీకరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుతో పాటు కళారంగానికి ఆయన చేస్తున్న సేవలకు ఈ గుర్తింపును అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.